# ఇంటర్వ్యూ

–సి హెచ్. వి. బృందావనరావు

ట్రెయిన్ బయలుదేరే సమయం ఇంక నాలుగైదు నిమిషాలు మాత్రమే వుంది మేం స్టేషన్ చేరుకునే సరికి. సామాన్యంగా ప్రయాణం చేసే రోజు కనీసం పదిహేను ఇరవై నిమిషాలు ముందుగానే స్టేషనుకు రావడం నాకు అలవాటు. ఇవ్వాళ ఆలస్యమైంది. నాతో పాటు ఇంకో ఫ్రెండూ వస్తున్నాడు. ఆదరాబాదరాగా టిక్కెట్టు తీసుకొని రైలు దగ్గరికి వెళ్లాం. ప్రతి కంపార్టు మెంటూ కిటకిటలాడిపోతున్నది. ఎలాగో కొద్ది ఖాళీ వున్న పెట్టెలో ఎక్కి సీటు సంపాదించి కూలబడ్డాము. బ్రీఫ్‌కేసులు పైన పెట్టి పేపర్లు చేతుల్లోకి తీసుకున్నాము. మధ్య మధ్య మాటలాడుకుంటూ. క్రమంగా కంపార్టు మెంటంతా నిండిపోయింది. నిలబడే జనం బాగా ఎక్కు వైనారు. రైలు కదిలేసరికి కంపార్టుమెంటంతా కిటకిట లాడిపోతున్నది.

నేను మామూలుగా ఫస్టు క్లాసులోనే వెళుతుం టాను. డ్యూటీ మీద పోయేటప్పుడు నాకు ఫస్టు క్లాసులో ప్రయాణించే అవకాశం వుంది. ఈసారి స్నేహితుడు గూడ తోడుండటంతో కబుర్లు చెప్పుకుంటూ పోవచ్చని సెకండ్ క్లాసులో ఎక్కాను. హైదరాబాదులో నేనొక ఇంటర్వ్యూకు హాజరు కావాలి. అంటే, ఇంటర్వ్యూ నిర్వహించేవాండ్లలో నే నొకడినన్న మాట. నాకు అప్పుడప్పుడూ ఇలాంటి డ్యూటీలు తగులుతుంటాయి. నేను పని చేసే ప్రభుత్వ శాఖలో గుమాస్తా ఉద్యోగాలకు, పరీక్షలూ అవీ అయిన తర్వాత జరిపే ఇంటర్వ్యూలలో ఫైనల్‌గా కొంత మందిని వడపోసి అర్హులను నిర్ణయిం చాలి. ఆ పని మీద నేనిప్పుడు వెళుతున్నాను.

ఒకసారి కంపార్టుమెంటంతా కలయజూశాను. మావాడు హిందూ పేపర్ క్రాస్‌వర్డ్ పజిల్లో గొంతు దాకా మునిగిపోయి వున్నాడు. ప్రక్కన బాంబుపడ్డా తిరిగి చూడడు. వాడిని అప్పుడు పలకరించడం అన వసరం. నా సీటుకు రెండు సీట్ల అవతల ఇద్దరు అమ్మా యిలు కూర్చొని వున్నారు. బాగా చదువుకున్న వాళ్ల లాగా వున్నారు. సీరియస్‌గా ఏదో మాట్లాడుకుంటు న్నారు. వాండ్లకు దగ్గరగా ఒక ముసలతను నిలబడి ఉన్నాడు. చోటు దొరకడలేదు పాపం. బాగా ముసలి వాడు. ఒక చేత్తో కర్ర పట్టుకొని, మరో చేత్తో పై బెర్తు ను పట్టుకొని నిలబడలేక నిలబడి వున్నాడు. అతని ప్రక్కనే ఒక ఆడ మనిషి నిలబడి వుంది చంకలో పిల్లతో. పిల్ల ఒకటే ఏడుస్తున్నది. ఊరుకోబెట్టడానికి ఎంత ప్రయత్నించినా ఊరుకోవడం లేదు. పాపం ఆమె చాలా అవస్థ పడుతున్నది. ఈ రష్‌లోనే టీ అమ్మే వాళ్లూ, కాఫీ అమ్మేవాళ్లూ, అడుక్కు తినే వాళ్లూ నిలబడ్డ జనాన్ని నెట్టుకొంటూ సునాయాసంగా వెళ్లి పోతు న్నారు. చంకలో ఏడ్చే పిల్లతో అటూ ఇటూ ఒరుగుతూ ఆ ఆడమనిషి చాలా ఇబ్బంది పడుతున్నది.

"అమ్మా, నిలబడలేకుండా వున్నాను. కాస్త సర్దు కోండి తల్లీ" అని ముసలతను సీరియస్‌గా మాట్లాడు కుంటున్న ఆడపిల్లల్ని అడిగాడు. వాండ్లు అతని వైపు తిరిగి ఒకసారి చూసి మళ్లీ మాటల్లో మునిగిపోయి నారు. రైలు కుదుపుకూ, వెనక ఎవరో తోసిందానికీ ముందుకు తూలి పడబోయినాడు ముసలతను. సీటు గట్టిగా పట్టుకొని "అమ్మా కొంచెం సర్దుకోండమ్మా" అన్నాడు.

ఇద్దర్లో ఒక అమ్మాయి ముసలతన్ని కోపంగా చూసింది. "మేం కూడ చాలా దూరం పోవాలె. సర్దు కోడం కుదరదు" అని చెప్పి మళ్లా మాటల్లోకి వెళ్లి పోయింది.

పక్కన ఆడ మనిషి చంకలో పిల్ల ఏడుపు ఆపడం లేదు. తల్లి సముదాయించలేక అవస్థ పడుతున్నది. పాలు నోటికందిస్తే గాని ఆ పాప ఏడవడం ఆపేట్లు లేదు. ఆమె నిలుచుని వున్నది. చంటి పిల్లకు పాలిచ్చే అవకాశం కన్పడటం లేదు.

"నాక్కాదు తల్లీ. అదుగో నా కూతురికి. పసిపిల్ల ఒకటే గుక్క పెడుతుండాది. కూసింత కూచుని పిల్లకు పాలిచ్చి మళ్లీ లేస్తది. ఒక్కరవ్వ జరగండమ్మా" అని ప్రాధేయపడ్డాడు ఆ ముసిలాడు. ఆ అమ్మాయిలు మాత్రం ముసలాడి వైపు చూడను గూడ చూడకుండా మాట్లాడుకుంటూనే ఉన్నారు. నిజంగా ఆ ముస లాయన, ఆయన కూతురూ– ఇద్దరూ పల్లెటూరి వాండ్లు– వాండ్ల ఇబ్బంది చూడడం కష్టంగానే వుంది.

"పోనీలే అయ్యా! ఇంకాస్త సేపుంటే దిగిపోతాం లెగకపోతే మాన్లే. ఆళ్లనే కూసోనియ్యి" అనింది ఆమె.

"ఇదుగో పెద్దాయనా, ఇటురా" అన్నాను నేను లేచి. ముసలతను వచ్చాడు. "నీ కూతుర్ని కూడా

రమ్మను ఇద్దరూ సర్దుకొని కూచోండి" అని చెప్పి నేను లచి నిలబడ్డాను. "కొంచెం జరిగి సర్దుకోవోయ్" అని మా వాడికి చెప్పాను. ఊహూ- వాడు క్రాస్‌వర్డ్ పజిల్లో ఇరుక్కొని ఉన్నాడు. నేనే వాణ్ణి అవతలికి జరిపాను. ఆ ముసలతనూ, అతని కూతురూ నేను కూర్చున్న సీట్లో సర్దుకొని ఇరుక్కొని కూర్చున్నారు. ఆ అమ్మాయిలు ఈ ఏర్పాటును గమనించి, మళ్లీ మాటల్లో మునిగిపోయినారు.

కొంచెం తెరిపి చిక్కింది కాబట్టి, ఆమె పిల్లను గుండెల దగ్గరకు చేర్చుకొని పమిట కొంగు కప్పుకుంది. చంటి పిల్ల క్రమంగా ఏడుపు ఆపింది. తల్లి ఈ లోకంతో సంబంధం లేనట్లు ఒక చేత్తో పాలు త్రాగే కూతురి ఒళ్లు నిమురుతూ తృప్తిగా కళ్లు మూసుకున్నది. తన కూతురూ, మనమరాలూ కొంచెం స్థిమితపడ్డందుకు తనూ నెమ్మదిపడ్డాడు ముసలాయన.

రైలు తన గర్భంలోని వేలాది జనాల బాధలూ భయాలూ, ఆశలూ, ఇబ్బందులూ ఏమీ పట్టించుకోకుండా పరుగు తీస్తున్నది. కరెంటు స్తంభాలూ, చెట్లూ, చేమలూ, పొలాలూ యమ స్పీడుగా వెనక్కి వెళ్లిపోతున్నాయి. "ఒడలెరుంగని మహా వేగమున ఎచటికీ లోకమిట్లు పరువెత్తుకొని పోవుచున్నది" అనే బాపిరాజు గారి నవల్లోని ఒక వాక్యం మనసులో మెదిలి నవ్వు వచ్చింది.

హైదరాబాదు చేరేసరికి ప్రొద్దుపోయింది. స్టేషన్ దగ్గరికి మా డిపార్టుమెంటు వారు జీపు పంపించారు. నాకోసం ఏర్పాటు చేసిన బసకు చేరుకొన్నాను. ప్రయాణపు బడలిక పోగొట్టుకోడానికి హాయిగా స్నానం చేసి నిద్రపోయాను.

పదకొండున్నర నించి ఇంటర్వ్యూలు. నిర్వహించాల్సిన వాండ్లం నేను కాక మరిద్దరు. వాండ్లిద్దరూ నాకు తెలిసినవారే. పరస్పరం కుశల ప్రశ్నాదికాలు అయినాక మా కార్యక్రమం ప్రారంభమైంది.

ఇంటర్వ్యూ చెయ్యాల్సిన అభ్యర్థులు ఒకరి తర్వాత ఒకరు వస్తున్నారు. వారు అంతకు ముందే పరీక్షలలో సంపాదించుకున్న మార్కులలో కొంత శాతానికి ఈ ఇంటర్వ్యూ మార్కులు కూడా కలిపి మెరిట్ లిస్ట్ తీస్తారు. ఇంటర్వ్యూలో సామాన్యంగా అభ్యర్థుల లోకజ్ఞానమూ, ప్రవర్తనా, మానసిక స్థితీ మొదలైన విషయాల మీద మార్కులుంటాయి.

అభ్యర్థులు ఒకరి తర్వాత ఒకరు రావడం- వాండ్లను ముగ్గురు అధికారులం ఒకరి తర్వాత ఒకరు ప్రశ్నించడం- మార్కులు వేయడం యాంత్రికంగా జరిగిపోతున్నది. మేము ఎంత యాంత్రికంగా నిర్వహిస్తున్నా, ఈ ఇంటర్వ్యూలు అతి ముఖ్యమైనవి కాబట్టి వాటి ప్రాధాన్యతను అర్థం చేసుకొనే జరుపుతున్నాము.

"నెక్స్ట్" అన్నాను నేను. బయటి నుంచి తలుపు నెట్టుకొని ఆ అమ్మాయి వచ్చింది. చూడగానే గుర్తించాను. నిన్న రైల్లో నా కంపార్టుమెంటులోనే ప్రయాణం చేసిన ఇద్దరమ్మాయిల్లో ఒకరు. ఆ అమ్మాయి కూడ నన్ను గుర్తుపట్టి ఉండవచ్చు.

"కూర్చోమ్మా" అన్నాడు నా కొలీగ్.

"థాంక్స్ సార్" అని కూర్చున్నది ఆ అమ్మాయి. మా రెండో కొలీగ్ ఆమె సర్టిఫికేట్లను ఒకసారి చూచి ప్రక్కన పెట్టాడు.

మా మొదటి కొలీగ్ ఆమెను ప్రశ్నిస్తున్నాడు. అన్నిటికీ టకటకా నదురూ బెదురూ లేకుండా సరైన సమాధానాలు ఇస్తున్నది ఆ అమ్మాయి. ఆమె ధైర్యంగా సరైన జవాబులు చెపుతుండటంతో కొంచెం కష్టమైన ప్రశ్నలు వేస్తున్నాడు మా కొలీగు. ఆ అమ్మాయి ఒక్క తప్పు కూడ లేకుండా అన్నిటికీ సరైన సమాధానాలు చెప్పింది.

ఆతర్వాత మా రెండో కొలీగ్ వేసిన ప్రశ్నలకు కూడ ఆ అమ్మాయి సరిగ్గా ఆన్సర్లు చెప్పింది.

ఇప్పుడు నా వంతు. ఆ అమ్మాయి మంచి తెలివి గల పిల్ల. అకడమిక్ అర్హతలు కూడ బాగున్నాయి.

## మానవీయ సౌధం ముందు...

మనసు చూరులోంచి
ఆత్మవంచన నక్కి నక్కి చూస్తుంటే
చూపు
శిఖరం అంచున
ఆలోచన
లోయల లోగిళ్ళలో
ఆకాశానికి నిచ్చెనలేసి
ఆత్రంగా ఎగబాకాలనుకుంటే
మానవీయ సౌధం ముందు
మరగుజ్జులే...!?

-సోమేపల్లి వెంకట సుబ్బయ్య

పరీక్షల్లో మార్కులూ బాగా స్కోర్ చేసింది. ఇంటర్వ్యూలో కూడ దంచేస్తున్నది.

"మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ అని ఒకాయన ఉండేవాడు. ఆయన పేరెప్పుడైనా విన్నావామ్మా" అడిగాను నేను.

నా కొలీగ్స్ ఇద్దరూ చిరునవ్వు నవ్వుతూ నన్నే చూస్తున్నారు. ఆ అమ్మాయి కూడ కొంచెం ఆశ్చర్య పోయినట్లుంది.

"విన్నాను సార్, మహాత్మా గాంధీ, మన జాతిపిత" ఆశ్చర్యపోతూనే జవాబిచ్చింది ఆ అమ్మాయి.

"ఆయన్ను మహాత్మా అని ఎందుకంటారో తెలుసా?"

"రవీంద్రనాథ్ టాగూరు మొదటిసారి గాంధీ గారిని మహాత్మా అని, అంటే గ్రేట్ సోల్ అని పిలిచారు. ఆతర్వాత అందరూ గాంధీ గారిని మహాత్మా అని సంబోధించేవారు" జవాబిచ్చింది ఆ అమ్మాయి.

బాగా తెలుసుకొని వచ్చిన అమ్మాయే. "గుడ్, కానీ మహాత్మా, అదే great soul, ఎలా అయ్యారాయన."

ఆ అమ్మాయి కొంచెం తడుముకుంటున్నది. "అసహాయోద్యమంలో జనాన్ని ఉత్తేజితుల్ని చేసి, బ్రిటిష్ వాండ్లను ఎదిరించి రక్తపాతం లేకుండా దేశానికి స్వరాజ్యం సంపాదించినందుకు" అని పుస్తకాల్లో చదివిన ముక్కలు కక్కేసింది ఆ అమ్మాయి. అది సమయమూ, సందర్భమూ కాకపోయినా, ఆ అమ్మాయికి కొంచెం చెపుదామనిపించింది.

"అది గాంధీ గారిని గురించిన ఒక పార్శ్వం మాత్రమే. నిజానికి ఆ కాలంలో గాంధీ గారి పరిపూర్ణ మైన వ్యక్తిత్వానికి ప్రభావితం కాని రంగమే లేదు. స్త్రీ జనోద్ధరణ, హరిజనోద్ధరణ, దేశ భాషా వికాసం, హిందూ ముస్లిం సఖ్యతా- అన్నిటిలోనూ ఆయన ముద్ర ప్రస్ఫుటంగా వుండేది."

ఆ అమ్మాయి ఇంటరెస్ట్‌గా వింటున్నదని గమనించాను. "గాంధీగారు ఒకసారి ఏమన్నారో తెలుసా! నేనేదైనా నిర్ణయం తీసుకోబోయే ముందు ఈ దేశంలోని అట్టడుగు వర్గపు దరిద్ర నారాయణుడిని ఒకసారి నా మనసులో ఊహించుకొని- నేను తీసుకోబోయే నిర్ణయం ఆ వ్యక్తికి ఏమైనా సహాయపడుతుందా అని ప్రశ్నించుకొంటాను. ఆ తర్వాత నిర్ణయం తీసుకోవడం చాలా సులభమైపోతుంది- అనేవాడు" అన్నాను.

ఆ అమ్మాయి ఆ విషయం మొదటిసారి వింటేమో, బాగా ఇంప్రెస్ అయినట్లుంది.

"వెరీ గ్రేట్ సర్, రియల్లీ వెరీ గ్రేట్ సోల్" అంది.

"ప్రభుత్వోద్యోగాల్లోకి వచ్చేవారు కూడ అదే ఆశయం కల్గినవారు అయివుండాలి. వారంతా మహాత్మా గాంధీలు అయి వుండటం సాధ్యం కాదు. ఆ అవసరం కూడ లేదు. ఏదో పని మీద ఆఫీసులకు వచ్చే పేద వారిని కసురుకోకుండా, అనవసర ఆలస్యం చేయకుండా, వారి నుండి ఏమీ ఆశించకుండా, ఆదరంగా చేసి పెట్టగలిగి వుంటే చాలు. ఏ దేశపు రాజధాని ఏదో, ఏ పుస్తకం ఎవరు రాశారో, ఏ యుద్ధం ఎప్పుడు జరిగిందో, ఎవరు గెలిచారో- ఇవ్వన్నీ మీకు తెలిసినా తెలియకపోయినా కొంపలేమీ మునిగిపోవు. ప్రభుత్వోద్యోగి అంటే ప్రజల మీద సవారి చేసేవాడు కాదు అనే జ్ఞానం ఉంటే చాలు" అన్నాను.

వినయంగా తలూపింది ఆ అమ్మాయి. నా క్లాసు కొనసాగించాను.

"దరిద్ర నారాయణుడంటే ఎవరో కాదు. వయసులో వున్న ఇతరులను తోసుకొని రైలెక్కలేక కర్ర పట్టుకొని వంగి నిలుచుని చోటివ్వండని ఎదుటి వాండ్లను ప్రాధేయపడే ముసలివాడు కావచ్చు. నెత్తిన మూటతో, చంకలో ఏడుస్తున్న పిల్లతో, ప్రక్కన ముసలి తండ్రితో అవస్థ పడే సగటు భారతీయ స్త్రీ కావచ్చు. అలాంటి వాండ్లకు కొంచెం చేయూత ఇవ్వాలనే మనోధర్మం కలిగి వుండటం ముఖ్యం ప్రభుత్వోద్యోగికి- మా శాఖకు అలాంటి వారే కావాలి" అన్నాను ఆ అమ్మాయినే చూస్తూ.

ఉలిక్కిపడింది ఆ అమ్మాయి. ముఖం కొంచెం నల్లబడ్డది. తల కిందికి వంచుకుంది. ఏమీ మాట్లాడ లేదు.

"థాంక్యూ! నౌ యూ కెన్ గో" అన్నాను.

"నమస్కారం సార్" అని మా ముగ్గురికీ వందనం చేసి సర్టిఫికెట్లు సర్దుకొని బయటకు నడిచింది ఆ అమ్మాయి.

ఆ అమ్మాయి బాగా తెలివైందనే సంగతి తెలుస్తూనే వున్నది. చిన్నతనం. సరైన దారి చూపిస్తే అందుకుంటుందనటంలో సందేహం లేదు. నేను సున్నితంగా ఇచ్చిన మోతాదు పనిచేసినట్లే వుంగి. అంత మంచి అకడమిక్ రికార్డూ, తెలివితేటలూ ఉన్న అభ్యర్థి ఏ శాఖకైనా అవసరమే!

మార్కులు వేసి, నా కొలీగ్స్ వైపు చూసి నవ్వి, "నెక్స్ట్" అన్నాను. ■